క్లుప్తంగా

2న కలెక్టరేట్ వద్ద ధర్నా



సమావేశానికి హాజరైన ఫ్యాప్టో నాయకులు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 2న ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో కో-చైర్మన్ ప్రసాద్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ వీవీ శేషు తెలిపారు. స్థానిక దర్గామిట్టలోని మున్సిపల్ పాఠశాలలో జిల్లా సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉమ్మడి సీనియారిటీ ద్వారనే ఎంఈఓ-1 పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు హజరత్, కృష్ణారెడ్డి, నరసింహ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చైతన్య జ్యోతి వెల్ఫేర్ అసోసియేట్ ఆధ్వర్యంలో నెల్లూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు ఆర్పీఎఫ్ సీఐ రమేష్ గౌడ్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాలో పిల్లలు, మహిళలు బాధితులవుతున్నారన్నారు. రైల్వేస్టేషన్ ఆవరణలో, రైలు ప్రయాణ సమయంలో ఇలాంటివి గుర్తిస్తే 1098, 112, 100 లాంటి హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఐ.శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.శంకరయ్య, ప్రాజెక్ట్ అడ్మిన్ ఆఫీసర్ నవీన్, కౌన్సిలర్ మున్వర్, ఆర్పీఎఫ్ సిబ్బంది, ఏహెచ్‌టీయూ ఏఎస్సై శ్రీహరి, జీఆర్పీ సీఐ హరిచందన ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



నెల్లూరు సిటీ: ఆమంచర్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఉప సర్పంచ్ మల్లినేని వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో స్మార్ట్ విజన్ కంటి ఆస్పత్రి, కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, వేగూరు హనుమంతరావు, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ మేనేజర్ కె.రాంబాబు, టెక్నీషియన్ డి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పొణకా కనకమ్మకు భారతరత్న ప్రకటించాలి



నెల్లూరు(బృందావనం): బలహీన వర్గాల సంక్షేమం, సామాజిక సేవ, బాలికా విద్య కోసం కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మకు భారతరత్న ప్రకటించాలని పొణకా కనకమ్మ ఆశయసాధన సమితి కన్వీనర్ బి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి పంపిన పత్రాలను ఆయన ప్రదర్శించారు. బాలికల ఉచిత విద్య కోసం పొణకా కనకమ్మ తన కుటుంబ ఆస్తిని దానం చేశారన్నారు. ఆమె సేవలను గుర్తించి కేంద్రం భారతరత్న ప్రకటించాలని విన్నవించారు. సమావేశంలో చెలంచర్ల భాస్కర్ రెడ్డి, షేక్.సందానిబాషా, దగ్గుమాటి కృష్ణయ్య శెట్టి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సిబ్బందితో పంచాయతీల్లో పనులు

నెల్లూరు (పొగతోట): జిల్లాలోని పంచాయతీల్లో తాగునీటి సరఫరా, విద్యుద్దీపాలు తదితర అవసరాల నిమిత్తం కాంట్రాక్టు ఉద్యోగులను నియమించేందుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి అవసరమైన సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బందికి వేతన చెల్లింపులు తదితర వాటిపై తప్పనిసరిగా ఆడిట్ నివేదికలు సమర్పించాలన్నారు.

మాకు తెలియకుండానే అనుమతులా..?



మాట్లాడుతున్న మేయర్ స్రవంతి



సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుడిని నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మహేష్

- కౌన్సిల్‌లో కార్పొరేటర్ల అసహనం

నెల్లూరు(బారకాసు): మాకు తెలియకుండానే ముందస్తు అనుమతులా.. అజెండాలోని అంశాలను ముందుగానే ఆమోదం చేశారా.. వర్కులు, పేమెంట్ జరిగిపోయాక మాతో పనేంటి.. కౌన్సిల్ సమావేశం ఎందుకు? అని కూటమి కార్పొరేటర్లు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో మేయర్ స్రవంతి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 111 మెయిన్ అజెండా, 6 సప్లిమెంటరీ అజెండా, 15 టేబుల్ అజెండాలుగా మొత్తం ప్రవేశపెట్టిన 132 తీర్మానాలను ఆమోదించారు. తొలుత డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులకు తెలియకుండానే అజెండాలోని 132 అంశాలను ముందస్తు అనుమతి కోసమంటూ సమావేశం నిర్వహించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. చర్చ లేకుండా ఆమోదం ఏమిటన్నారు. తర్వాత చేజర్ల మహేష్, కిన్నెర మాల్యాద్రి, గోతం అరుణ, తాళ్లూరు అవినాష్, తదితర కూటమి కార్పొరేటర్లు కౌన్సిల్ సాక్షిగా ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. స్థానిక సమస్యలపై గతంలో తెలియజేసినప్పటికీ నేటికీ పరిష్కారం కాకపోవడంతో ప్రజలు తమను నిలదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- కాగా కో-ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ కాలువల్లోని సిల్ట్‌ను పెన్నా నదిలో వేస్తున్నారని, దీనిపై సదరు వ్యక్తులను అడిగితే గాంధీబొమ్మ ప్రాంత కార్పొరేటర్ చెబితేనే చేస్తున్నామనే సమాధానం వస్తోందన్నారు. దీంతో సంబంధిత కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల కో-ఆప్షన్ సభ్యుడిగా పదవి పొంది ఇప్పుడు మా మీదనే నిందలు వేయడం విడ్డూరమన్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తన డివిజన్ పరిధిలో చిన్నచిన్న సమస్యలను ఇటీవల మేయర్ పర్యటనకు వచ్చిన సమయంలో తెలియజేశామని, అయితే ఇప్పటివరకు ఏవీ పరిష్కారం కాలేదన్నారు. రూ.కోట్లు విలువ చేసే పనులు మాత్రం చేస్తున్నారని తాను అడిగిన చిన్న చిన్న పనులు మాత్రం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మేయర్ స్రవంతి మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం సుమారు రూ.43 కోట్లకు సంబంధించిన అజెండా అంశాలను నగరపాలక సంస్థ బడ్జెట్లో కేటాయించామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను అధికారులు వేగంగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ నందన్‌తో పాటు ఎస్‌ఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అలరించిన పద్య నాటకోత్సవాలు



కళాకారులకు సన్మానం

నెల్లూరు(బృందావనం): సింహపురి పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పద్య నాటకోత్సవాలు పుర మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రామాయణం, మహాభారతం, భాగవతాల్లోని పలు ఘట్టాలతో భారతీయ సంస్కృతి, చరిత్ర, తెలుగుభాష గొప్పతనాన్ని చాటుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పలువురు కళాకారులు ప్రదర్శించిన నాటకాలు అలరించాయి. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలను సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.వెంకటేశ్వర్లు, వి.చక్రపాణి, కోశాధికారి కొమ్మిరెడ్డి హరనాథ్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎస్కే ఖాజామస్తాన్, ఎస్.తిరుపతిరెడ్డి, జి.రామకృష్ణ, గండి సురేష్‌బాబు తదితరులు పర్యవేక్షించారు.

కుళాయి కనెక్షన్ల తొలగింపు



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని 35వ వార్డు లేక్ వ్యూ కాలనీలో ఇద్దరు భవన యజమానులు గత 21 ఏళ్లగా పన్నులు చెల్లించకుండా ఉండడాన్ని అధికారులు గుర్తించారు. వీరి ఇళ్లకు మొదటి చర్యలో భాగంగా బుధవారం తాగునీటి కుళాయి కనెక్షన్ను కట్ చేశారు. అదేవిధంగా 41వ డివిజన్ పరిధిలోని శివగిరి కాలనీలో అనేక సంవత్సరాలుగా ఎటువంటి ఆస్తి పన్నులు లేకుండా ముగ్గురు భవన యజమానులు అనధికారికంగా కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేసుకొని అక్రమంగా నీటిని వినియోగించుకోవడాన్ని గుర్తించి తొలగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ మాట్లాడుతూ ప్రతి భవన యజమాని పన్నులను సకాలంలో చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

డాక్టర్ నరేంద్రకు అశ్రునివాళి



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి



హాజరైన మెడికల్ విద్యార్థులు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ మెడికల్ కళాశాల, సర్వజన ఆస్పత్రి అభివృద్ధిలో జనరల్ మెడిసిన్ విభాగ హెచ్‌ఓడీగా కీలకపాత్ర పోషించిన డాక్టర్ నరేంద్ర లేనిలోటు తీర్చలేనిదని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా అన్నారు. రెండు రోజుల క్రితం డాక్టర్ నరేంద్ర గుండెపోటుతో మృతిచెందగా, ఆయన సంతాప సభను నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు డాక్టర్లు, సిబ్బంది పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ కళాశాలకు పీజీ సీట్ల సాధనలో, వైద్య విద్యార్థుల నూరు శాతం ఫలితాల్లో ఆయన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, డాక్టర్లు శోభారాణి, గంగాధర్‌లతో పాటు ఏడీ ఏడుకొండలు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మహిళ కారుతో బీభత్సం

- బైక్‌ను ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలు
- ప్రైవేట్ బస్సును ఢీకొన్న వైనం
- ఆమెకు మద్దతుగా అధికార నేతల రంగ ప్రవేశం

నెల్లూరు (క్రైమ్): మద్యం మత్తులో ఓ మహిళ బుధవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళ్లితే.. ఓ మహిళ ఫూటుగా మద్యం తాగి వెంకటాచలం నుంచి బుజబుజనెల్లూరు మీదుగా అయ్యప్పగుడి మార్గంలో నెల్లూరు నగరంలోకి వస్తోంది. తాగిన మైకంలో ఉన్న ఆమె బుజబుజనెల్లూరు ఉన్నత పాఠశాల వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో బైక్ వస్తున్న వారు రోడ్డుపై పడడంతో ఓ వ్యక్తికి త్రీవగాయాలయ్యాయి. అయితే ఆమె ఆగకుండా కారును వేగం పెంచి అయ్యప్పగుడి సమీపానికి చేరుకుంది. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ప్రైవేట్ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక భాగం దెబ్బతినగా, కారు ముందు భాగం పూర్తిగా నుజునుజ్జు అయింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఘటనా స్థలానికి చేరుకున్న వేదాయపాళెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన మహిళను కారుతో సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు విచారిస్తున్నారు. ఆ మహిళ ఎవరనే విషయం తెలియరావాల్సి ఉంది. పోలీసులు సైతం ఇంకా వివరాలు తెలియలేదని చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆ మహిళ కోసం కొందరు అధికార పార్టీ నేతలు రంగంలోకి దిగి వదిలి పెట్టాలని పోలీసులపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలిసింది. మరి ఘటనపై పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

- జేసీ కార్తీక్



నెల్లూరు రూరల్: అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జేసీ కె.కార్తీక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజుల్లోగా దరఖాస్తులు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను కొత్త నిబంధన ప్రకారం ప్రస్తుతం పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ప్లాట్ల విలువ ఆధారంగా ఫైనలైజేషన్ చార్జీలు, ఓపెన్ స్పేస్ చార్జీలు విధిస్తారన్నారు. పూర్తి వివరాలకు నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం తరఫున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్లు 89777 68262, 89777 68267ను సంప్రదించాలని తెలియజేశారు.

నెల్లూరు(బారకాసు): అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నగరంలోని నుడా కార్యాలయంలో ఆయన బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈనెల 26 నుంచి 90 రోజుల్లోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళలకు చిరుధాన్యాలపై శిక్షణ

నెల్లూరు (పొగతోట): చిరుధాన్యాల ఆధారిత పోషణ, పంటల శిక్షణా కార్యక్రమం కోవూరు సంఘమిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సాహవంతులైన స్వయం సహాయక సంఘాల గ్రూపు మహిళలు 72079 49281 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం డీఆర్‌డీఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పదవీ విరమణ ఉద్యోగి విరాళం



నెల్లూరు(అర్బన్): నగరంలోని మూలాపేటకు చెందిన గిరీష్‌బాబు గూడూరులో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఈ క్రమంలో ఆయన బుధవారం నగరంలోని జయభారత్ ఆస్పత్రికి అలాగే బీవీ నగర్‌లోని జనహిత వాత్సల్య ఆశ్రమానికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. అలాగే ఆయన పనిచేసిన డిపార్ట్‌మెంట్‌లో డ్రైవర్ కుమార్తె గ్రహణమొర్రి ఆపరేషన్‌కు రూ.10 వేలు, స్వీపర్, స్కావెంజర్, వాచ్‌మెన్‌లకు కూడా రూ.10 వేలు చొప్పున సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా గిరీష్‌బాబు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో సేవ చేస్తున్నందుకు తన పదవీ విరమణ సందర్భంగా వచ్చేమొత్తంలో విరాళాలు అందించానన్నారు. కార్యక్రమంలో జనహిత వాత్సల్య ప్రతినిధులు సాంబశివరావు, దుర్గాప్రసాద్, జయభారత్ ఆస్పత్రి ప్రతినిధులు గురుప్రసాద్, పట్టాభిరామ్ పాల్గొన్నారు.

యాప్‌లపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

నెల్లూరు (పొగతోట): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి నూతన యాప్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని డ్వామా పీడీ గంగాభవాని ఈసీలు, టీఏలను ఆదేశించారు. నగరంలోని డ్వామా క్లస్టర్ కార్యాలయంలో నూతన యాప్‌లపై ఈసీలు, టీఏలకు బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి జరుగుతున్న పనులు, పని ప్రదేశాలు, పూర్తి వివరాలను నూతన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. కూలీలకు సంబంధించి ఆధార్ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. పని ప్రదేశంలో రెండు ఫొటోలు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన యాప్‌లను క్షేత్రస్థాయిలో ఎఫ్‌ఏలకు, కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీలు శంకరనారాయణ, మృదుల, వివిధ మండలాల ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.

చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను క్రమం తప్పకుండా చేపడుతూ, 24 గంటల్లోపు గార్బేజీల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేలా పర్యవేక్షించాలని కమిషనర్ వైఓ నందన్ శానిటేషన్ అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని ఎన్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తప్పనిసరిగా తడి, పొడి చెత్తను విడిగా సేకరించేలా పారిశుద్ధ్య సిబ్బందిని పర్యవేక్షించాలని సూచించారు. శానిటేషన్ మేస్త్రీలు విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత చేపట్టాలన్నారు. అన్ని వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, సచివాలయాల వారీగా పరిశీలించి ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, మలేరియా విభాగం అధికారి జిజియాబాయి, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి దేవస్థానంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మూడో రోజు బుధవారం పూజలు, చతుర్వేద పారాయణం, అభిషేకాలు, ప్రతిష్టామూర్తుల ఉత్సవం తదితర కార్యక్రమాలు విశేషంగా నిర్వహించారు. కంచిపీఠ ఆస్థాన సిద్ధాంతి ఎల్. విజయసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ జీర్ణోద్ధరణ, విమాన గోపురం పునఃనిర్మాణ దాతలు ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి, రాధిక, నవగ్రహ మండపం దాతలు పసుపులేటి సుబ్రహ్మణ్యం, నరసింహారావు పాల్గొన్నారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు ఎస్.రఘురామమూర్తి పర్యవేక్షించారు.

2న మహిళా క్రికెట్ జట్టు ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని క్రికెట్ ప్రాంగణంలో మహిళల అండర్-23 సీనియర్ జిల్లా జట్టు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, సొంత క్రికెట్ కిట్టు, వైట్ డ్రెస్ కోడ్‌తో పాల్గొనాలన్నారు.

సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు (పొగతోట): పొదలకూరు సర్పంచ్ ఎం.చిట్టెమ్మ, వెంకటాచలం సర్పంచ్ రాజేశ్వరిలకు నిధుల దుర్వినియోగంపై షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నోటీసులు అందిన వారం రోజుల్లోగా సమాచారం అందజేయాలని తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు, ఆమంచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు నాగమోహన్, శ్రీదేవీ పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యత గురించి వివరించారు. 50 శాతం సబ్సిడీతో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.